సాక్షి అనకాపల్లి

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ఉత్సవ్ వేళ.. ఆనంద హేల

IIలో



పగిలిన తాటిపూడి పైప్‌లైన్

పెందుర్తి మహిళా ప్రగతి కేంద్రం సమీపంలో పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు దాదాపు కిలోమీటరు మేర రోడ్డుపై ప్రవహించింది.



సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు.

విద్యార్థుల పక్షాన ఫీజు పోరు



విద్యార్థుల ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాల నాయుడు, పార్టీ పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజు

- రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని 5న కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన
- న్యాయం జరిగే వరకు పోరాడతాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు

అనకాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న కలెక్టరేట్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,900 కోట్ల మేర పేరుకుపోయాయని, ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించిందని, వైఎస్సార్‌సీపీ వాటి కోసం ప్రజల తరఫున పోరాడుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గతంలో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా ముందుగా కలెక్టర్, ఎస్పీలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై వినతిపత్రం అందజేస్తామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కొంతమంది విద్యార్థులు మధ్యలో చదువులు మానేసి పనులకు వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు.

కూటమి షాకులతో జనం బెంబేలు

మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల షాక్ నెల రోజులు తరువాత గట్టిగా తగులుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చార్జీలు పెంచి, ఒక్క అమరావతిలో మాత్రం పెంచలేదనడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్క అమరావతిలోనే పేదలున్నారా.. అని నిలదీశారు. కేంద్రం నుంచి అప్పులు తెచ్చి, కూటమి నేతలు వారి జేబులు నింపుకుంటున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ సర్కారు వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని, కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి మనసు రావడం లేదన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థుల ఫీజు పోరు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామ రాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీటీసీలు దంతులూరి శ్రీధర్‌రాజు, దొండా రాంబాబు, సత్యం, పార్టీ మండలాల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, 80, 84వ వార్డుల ఇన్‌చార్జ్‌లు కె.ఎం.నాయుడు, కోరుకొండ రాఘవ, రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు, మహిళలకు ఆశాజనకంగా..



ఎంఎస్‌ఎంఈ రంగానికి చేయూతనిస్తూ, ఎగుమతుల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యతనివ్వడం ప్రశంసనీయం. క్రెడిట్ పరిమితిని రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, స్టార్టప్‌లకు రూ.10 కోట్లకు పెంచడంతో పాటు వృద్ధిలో ఉన్న ఎంఎస్‌ఎంఈ ఎగుమతిదారులకు టర్మ్ లోన్‌ను రూ.20 కోట్లకు పెంచడంతో ఈ రంగాలకు పెట్టుబడి, వర్కింగ్ క్యాపిటల్ బలోపేతమవుతాయి. యువతను సన్నద్ధం చేసేలా 5 నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఏర్పాటు అభినందనీయం. గ్లోబల్ స్కిల్లింగ్ భాగస్వామ్యాలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏఐ ఏర్పాటు ఉండటం నిరుద్యోగులు, మహిళలలో నైపుణ్యాన్ని పెంచుతుంది. – కంకటాల మల్లికార్జునరావు, ఫ్యాప్సీ ప్రెసిడెంట్

రెండు దశాబ్దాల తర్వాత గణనీయమైన సవరణ



దాదాపు 20 ఏళ్లలో మొదటిసారిగా వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబ్‌లలో గణనీయమైన సవరణను సూచించారు. ఈ నిర్ణయంతో ఈ బడ్జెట్ చారిత్రాత్మకమైందిగా నిలిచిపోతుంది. ఇది మధ్య తరగతికి ఒక పెద్ద ప్రోత్సాహకం. ఈ పన్ను ఆదా ప్రజలు ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవడంలో సహాయ పడటమే కాకుండా ఎక్కువ ఆర్థిక సౌలభ్యాన్ని కూడా ఇస్తుంది. వ్యవసాయ రంగానికి అనేక ప్రగతిశీల కార్యక్రమాలు ప్రవేశపెట్టడం ప్రశంసనీయం.

–సుధీర్ ములగాడ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈసీ సభ్యుడు

మధ్యతరగతి,గ్రామీణ ప్రాంతాలకు ప్రయోజనం



బడ్జెట్ మధ్య తరగతి, గ్రామీణాభివృద్ధికి గణనీయమైన ప్రయోజనాలను అందించనుంది. జీడీపీ వృద్ధికి దోహద పడుతోంది, వ్యవసాయ రంగంలో సంస్కరణలు కాలక్రమేణా స్థిరమైన ప్రయోజనాలను అందించనున్నాయి. బీమా రంగంలో ఎఫ్‌డీఐని 100శాతానికి పెంచడం వల్ల మరిన్ని విదేశీ కంపెనీలను ఆకర్షించే అవకాశం ఉంది. తద్వారా ప్రజలకు బీమా సౌకర్యం మరింత అందుబాటులోకి రానుంది.

–పైడా కృష్ణప్రసాద్, పారిశ్రామిక రంగ నిపుణుడు



విద్యకు పెరగని కేటాయింపులు



ఈ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యకు కేవలం 2.5 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయం. కొఠారి కమీషన్ సూచనల ప్రకారం కనీసం 6 శాతం నిధులు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉంది. పాఠశాల విద్యా ప్రస్తుత స్థితిగతుల గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించకపోవడం నిరాశ కలిగింది. రానున్న ఐదేళ్లలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పినప్పటికీ.. సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పనపై స్పష్టం ఇవ్వలేదు.

– ఏఎస్ నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు, ఏపీటీఎఫ్–1938


ఆశ నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండిచేయి

సాక్షి, విశాఖపట్నం: కర్షక, పారిశ్రామిక, మధ్య తరగతి వర్గాలను కాస్తా ఊరడించేలా.. పద్దు లెక్కలు చదివిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. విశాఖను మాత్రం పూర్తిగా విస్మరించారు. డీపీఆర్ ఇచ్చినా.. వైజాగ్ మెట్రో ఊసే లేదు.. రైల్వే జోన్ ప్రస్తావన లేదు.. అంతెందుకు విశాఖ పేరు కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం జిల్లా ప్రజల్నే విస్మయానికి గురిచేసింది. కేవలం ఉద్యోగుల్ని ఊరడిస్తూ.. పన్ను చెల్లింపుదారుల్ని పలకరిస్తూ.. రైతులకు భరోసా ఇస్తూ.. యువతకు నైపుణ్యం అందించేలా చెయ్యందిస్తూ.. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ.. సాగిన సుదీర్ఘ ప్రసంగం వల్ల విశాఖకు ఒనగూరిన ప్రయోజనాలేవీ కనిపించలేదంటూ ప్రతి ఒక్కరూ పెదవి విరుస్తున్నారు. అయితే స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు, హిందూస్థాన్ షిప్‌యార్డులో జరుగుతున్న అభివృద్ధి పనుల కోసం రూ.150 కోట్లు కేటాయించారు. దేశంలోని మేజర్ పోర్టులకు కేటాయించిన మాదిరిగానే విశాఖ పోర్టు అథారిటీకి రూ.730 కోట్లు విదిలించారు.

- మెట్రో ఊసే లేదు.. 'జోన్' కూత వినిపించలేదు
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపు
- ప్యాకేజీ నిధుల్లో భాగంగానేకొంత విదిలింపు
- అన్ని పోర్టులతో పాటు వైజాగ్ పోర్టుకు రూ.730 కోట్లు
- షిప్‌యార్డుకు రూ.150 కోట్లు
- ఇవి మినహా.. పద్దులో విశాఖ ప్రస్తావన శూన్యం
- ఆదాయపు పన్ను వర్గాలకు కాసింత ఊరట

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మేలు



రాష్ట్ర బడ్జెట్‌లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మేలు జరిగేలా, ఎంఎస్‌ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఎంఎస్‌ఎంఈలు 7.5 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తూ భారతీయ తయారీ రంగంలో 36 శాతం, ఎగుమతుల్లో 45 శాతం వాటాను కలిగి వున్నాయి. వీటి ప్రగతిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం పెట్టుబడి పరిమితిని 2.5 రెట్లు, టర్నోవర్ పరిమితిని 2 రెట్లు పెంచింది. – డాక్టర్ మళ్ల పూర్ణ సూరి గణేష్, పిసినికాడ (ప్రొఫెసర్, అంబేద్కర్ వర్సిటీ)

వాల్తేరు డివిజన్‌కు అతీగతి లేదు

విశాఖ రైల్వే జోన్‌కు దాదాపు నెల రోజుల క్రితం ప్రధాని మోదీ వైజాగ్ వచ్చి మరీ శంకుస్థాపన చేశారు. కానీ.. బడ్జెట్‌లో జోన్ పనులకు సంబంధించిన ప్రస్తావనే తీసుకురాలేదు. వాల్తేర్ డివిజన్ కొనసాగింపు గురించి కూడా అతీగతి లేదన్నది బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైంది. జోన్ ప్రకటించి ఐదున్నరేళ్లు గడిచినా.. ఆచరణలో మాత్రం అడుగు పడేందుకు ఇంకొంత సమయం వేచి ఉండాల్సిందేనని కేంద్ర మంత్రి సీతారామన్ చెప్పకనే చెప్పేశారు.

మెట్రో గాలికేనా.?

విశాఖ నగరానికి మెట్రో కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం డీపీఆర్‌ని 2024 జనవరిలో కేంద్రానికి పంపించింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం కొత్త డీపీఆర్‌ని కూడా సిద్ధం చేసేసింది. మెట్రో రైలు ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా విదిలించకపోవడం అందర్నీ ఆగ్రహానికి గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టుపై ముందుకెళ్తున్నామని చెబుతున్నా.. కేంద్రంపై మాత్రం ఒత్తిడి తీసుకురాలేదని బడ్జెట్ ప్రసంగంలో స్పష్టమైందని అన్ని వర్గాలూ పెదవి విరుస్తున్నాయి.

ఎంఎస్‌ఎంఈలకు చేయూత

ఎంఎస్‌ఎంఈలపై బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. ఎంఎస్‌ఎంఈ రుణాలు రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు పెంచారు. తయారీ రంగంలో 36 శాతం వాటా ఉన్న ఎంఎస్‌ఎంఈలకు ఈ రుణ పరిమితి పెంపు పెద్ద ఊరటనిచ్చే అంశమని పారిశ్రామికవర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో మొత్తం 4450 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఉండగా 14,639 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఇందులో దాదాపు 70 శాతం ఎంఎస్‌ఎంఈలు లబ్ధి పొందే అవకాశాలున్నాయి. గతంలో రూ.కోటి వరకూ ఆడిట్ లేకుండా ఉండగా.. ఇప్పుడు రూ.5 కోట్ల వరకూ ఆడిట్ లేకుండా చేయడంతో మధ్య తరహా పరిశ్రమలు స్వల్పంగా లాభపడతాయి.

ఉక్కు కేటాయింపులు.. ఆ నిధుల్లో భాగమే.?

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.3,295 కోట్లు కేటాయింపులు చేస్తున్నట్లు బడ్జెట్‌లో పొందుపరిచారు. అయితే ఈ కేటాయింపులు ఏ ప్రాతిపదికన ఇస్తున్నారనే దానిపై అందరిలోనూ సందిగ్ధం నెలకొంది. ఇటీవల ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ నిధుల్లో భాగమే ఈ కేటాయింపులు చేశారే తప్ప.. కొత్త కేటాయింపులు కాదని స్టీల్‌ప్లాంట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే తొలివిడత కింద కొద్ది నెలల క్రితం రూ.1640 కోట్లు ఇవ్వగా.. తాజాగా శుక్రవారం రాత్రి మరో రూ.6,783 కోట్లు మంజూరు చేశారు. ఇప్పుడు మరో రూ.3,295 కోట్లు కేటాయింపులు చేశారు. ఇవి ఈ ఆర్థిక సంవత్సరం లోపు ఇచ్చే అవకాశం ఉంది. ఈ నిధులతో ప్లాంట్ ఎలా ముందుకు దూసుకెళ్లగలదని ఉద్యోగ, కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి.

కూటమి ఫ్లెక్సీలకు కోడ్ వర్తించదా?



నక్కపల్లిలో అధికారులు తొలగించని కూటమి నేతల ఫ్లెక్సీలు

నక్కపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూటమి నేతలకు వర్తించదేమో..! అధికారుల వైఖరి చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. మార్చి వరకు ఎన్నికల కోడ్ ఉంటుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. గ్రామాలు, పట్టణాల్లో వివిధ పార్టీ నేతల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కాటౌట్లు తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను నక్కపల్లి మండల అధికారులు అమలు చేయడం లేదని పలువురు ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. నక్కపల్లితో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు ఉన్న ఫ్లెక్సీలు ఇప్పటి వరకు తొలగించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఈ ఫ్లెక్సీలు తొలగించాలని కోరుతున్నారు.

పీజీఆర్‌ఎస్ నిలుపుదల

తుమ్మపాల: జిల్లాలో శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్)ను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 27న ఎన్నికలు నిర్వహిస్తామని, ఓట్ల లెక్కింపు మార్చి 3న జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ మార్చి 8న ముగుస్తుందన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యేవరకు కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో నిర్వహించే పీజీఆర్‌ఎస్ నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

కరక ఫారెస్ట్‌లో ఏం జరుగుతోంది?

- మైనింగ్ అధికారుల అత్యుత్సాహం
- అప్రమత్తమైన అటవీ అధికారులు
- సర్వేకు వెళ్లిన రాయల్టీ అధికారికి షోకాజ్ నోటీసు
- 'మైనింగ్' బృందంలో ఇద్దరు రంగురాళ్ల వ్యాపారులు
- వారిలో ఒకరు టీడీపీ నేత
- మైనింగ్ ఏడీ ఆదేశాలతోనే సర్వేకు వచ్చినట్టు చెబుతున్న రాయల్టీ అధికారి



రంగురాళ్ల క్వారీ ఉన్న కరక రిజర్వ్ ఫారెస్టు



రంగురాళ్లు

నర్సీపట్నం: కరక రంగురాళ్లకు మంచి గిరాకీ ఉంది. రంగురాళ్ల వ్యాపారులు సమయం కోసం నిత్యం క్వారీపై కన్నేసి ఉంచుతారు. కోట్ల విలువ చేసే రంగురాళ్లను అటవీశాఖ అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. కరక రంగురాళ్ల క్వారీని నిషేధిత ప్రాంతంగా ప్రకటించడంతో పాటు 144 సెక్షన్ అమల్లోకి తీసుకువచ్చారు. అటవీశాఖ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నర్సీపట్నం మైనింగ్ అధికారులు రంగురాళ్ల వ్యాపారులను వెంటబెట్టుకొని కరక రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న రంగురాళ్ల క్వారీ ప్రాంతానికి శుక్రవారం వెళ్లారు. దీంతో అనుమతి లేకుండా క్వారీ ప్రాంతానికి వెళ్లిన మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తికి అటవీశాఖ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. గతంలో ఈ క్వారీలో అనధికారిక తవ్వకాలు జరిగిన విషయం తెలిసిందే. నర్సీపట్నం మైనింగ్ అధికారులు అటవీ శాఖకు సమాచారం ఇవ్వకుండా కరక రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రవేశించడంతో గస్తీలో ఉన్న ఫారెస్టు సిబ్బంది అప్రమత్తమయ్యారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, రంగురాళ్ల వ్యాపారులు, మరికొంతమంది సిబ్బందిని అదుపులోకి తీసుకుని నర్సీపట్నం రేంజ్ కార్యాలయానికి తరలించారు. మైనింగ్ ఏడీ శివాజీ ఆదేశాల మేరకు తాము సర్వేకు వెళ్లామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. తనతో వచ్చిన సర్వే బృందంలో రంగురాళ్ల వ్యాపారులు ఉన్న విషయం తనకు తెలియదని ఆర్‌ఐ చెబుతున్నారు. ఈ విషయంపై మైనింగ్ ఏడీ శివాజీ పొంతన లేని సమాధానం ఇచ్చారు. అటవీ అధికారులకు సమాచారం ఇవ్వకపోవటం, మైనింగ్ అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడం రంగురాళ్ల క్వారీల్లో అక్రమ తవ్వకాలకు ఊతమిస్తుంది.

అదుపులో టీడీపీ నేత : గతంలో రంగురాళ్ల కేసులు ఉన్న వ్యాపారి, టీడీపీ నాయకుడు కొండలరావు, కరక క్వారీకి సమీపంలో గల యల్లవరం గ్రామానికి చెందిన అల్లు నూకరాజులతోపాటు చోడవరం మైనింగ్ సిబ్బందిగా చెబుతున్న పి.శివకుమార్, కూర్మదాసు అప్పలనాయుడు, ఒ.వీర నాగేశ్వరరావు, రామచంద్రరావులను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. విచారణ తరువాత మిగిలిన వ్యక్తులపై చర్యలకు అటవీ అధికారులు సిద్ధమవుతున్నారు.

చట్టరీత్యా చర్యలు : ముందస్తు అనుమతులు లేకుండా కరక రంగురాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రవేశిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ స్పష్టం చేశారు. సర్వే పేరుతో క్వారీ ప్రాంతానికి వెళ్లిన మైనింగ్ సిబ్బంది, కొంతమంది వ్యక్తులపై విచారణ జరుగుతోందని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో స్పష్టం చేశారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన

- ఉదయం 6.30 గంటలకు కె.కోటపాడు మండలం సందర్శన
- పింఛన్ల పంపిణీ, ఉపాధి పనుల పరిశీలన
- కూరగాయ రైతుల కష్టసుఖాలు తెలుసుకున్న కలెక్టర్



గొండుపాలెంలో లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛన్‌ను అందిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



కె.సంతపాలెంలో కూరగాయల సాగును తెలుసుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కె.కోటపాడు: కలెక్టర్ విజయ కృష్ణన్ కె.కోటపాడు మండలంలో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 6.30 గంటల సమయంలో ఆమె మండలంలో ప్రవేశించారు. ముందుగా గొండుపాలెం గ్రామానికి వెళ్లిన కలెక్టర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. 16 నుంచి 59 ఏళ్ల వయస్సు గల ఉపాధి వేతనదారులు ఈశ్రమ్ రిజిస్ట్రేషన్లను గ్రామ, వార్డు సచివాలయం, సీఎస్‌సీ సెంటర్స్, పోస్టాఫీస్‌లలో ఉచితంగా చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు. పీఎఫ్, ఈఎస్ఐ వర్తించని వారు ఈశ్రమ్‌లో రిజిస్ట్రేషన్‌ను చేయించుకునేందుకు అర్హులని ఆమె తెలిపారు. వారికి ఐదేళ్లలోగా ప్రమాదాల సమయాల్లో మరణిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యం బారిన పడితే రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అందుతుందని వివరించారు. అనంతరం కె.సంతపాలెం గ్రామంలో రైతులు పండిస్తున్న కూరగాయలు, మామిడిపంటను ఆమె పరిశీలించారు. కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, కింతాడ, మర్రివలస తదితర గ్రామాల్లో ఎంతమంది రైతులు కూరగాయల పంటలను సాగు చేస్తున్నారో, వారు పండించిన కూరగాయల పంటలను ఏఏ ప్రాంతాల్లో అమ్ముతున్నారో స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల ధరలు హెచ్చు తగ్గులు ఉండే సమయాల్లో రైతులు నష్టపోకుండా ఏం చేయవచ్చో ఉద్యానవన శాఖాధికారులు నివేదిక ద్వారా వివరించమని ఆమె సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, డీఆర్‌డీఏ పీడీ కె.శచీదేవి, జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకరరావు, ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ రమేష్, ఏపీవో అప్పలరాజు, వెలుగు ఏపీఎం చినబాబు, ఉద్యానవనశాఖాధికారి కిరణ్మయి, ఏవో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో ఆగని నిరసనలు

- ఇద్దరు సీఐటీయూ నేతల అరెస్టు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ కార్మికులు శాంతించడంలేదు. గత రెండు రోజులుగా పనివేళల పెంపుపై కదం తొక్కిన మహిళా కార్మికులు అధికారుల హామీతో శుక్రవారం శాంతించారు. శనివారం మళ్లీ తమకు వేతనాలు పెంచాలని, సెలవులు ఇవ్వాలని, మెడికల్ క్లెయిమ్‌లు చేయాలని, వేధింపులు ఆపాలని ఆందోళనకు పూనుకున్నారు. ఇదే సమయంలో సీఐటీయూ నేతలిద్దర్ని అరెస్టు చేయడంతో ఉద్యమకారుల్లో ఆగ్రహం పెల్లుబికింది. చివరకు బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి రంగంలోకి దిగి త్వరలో న్యాయం చేస్తానని వారిని శాంతింపజేశారు.


పార్వతీపురం నందికొట్ట గిరిజనుల డ్యాన్సు


ఆకట్టుకున్న ఫ్లవర్ షో


హెలీకాప్టర్‌లో విహారానికి కుటుంబ సభ్యులతో కలెక్టర్ దినేష్‌కుమార్


సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న కలెక్టర్ దినేస్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పనశ్రీ, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

ఉత్సవ్ వేళ.. ఆనంద హేల

అరకు చలి ఉత్సవ్ రెండో రోజు కూడా ఉత్సాహంగా సాగింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు, సందర్శకులు పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, హెలీరైడ్‌లో పాల్గొని ప్రకృతి అందాలను తనివితీరా వీక్షించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- రెండో రోజు అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కిటకిటలాడిన సందర్శిత ప్రాంతాలు
- పుష్ప ప్రదర్శన వద్ద సెల్ఫీలు, ఫొటోలు
- భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించిన అధికార యంత్రాంగం


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అరకులోయ టౌన్/ డుంబ్రిగుడ: అరకు చలి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం నిర్వహించిన కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మొదటి రోజు కన్నా భారీగా తరలిరావడంతో ఉత్సవ ప్రాంగణం నిండిపోయింది. సందర్శిత ప్రాంతాలు కూడా కిటికిటలాడాయి. పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్‌కు విశేష స్పందన లభించింది. హెలీకాప్టర్‌లో విహరించి అరకు అందాలను తిలకించి మంత్రముగ్ధులయ్యారు. హెలీరైడ్‌లో పాల్గొనే అవకాశం అందరికీ దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు.

పుష్ప ప్రదర్శనలో సెల్ఫీలు, ఫొటోలు..

అరకు పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. పూలతో రూపొందించిన నెమలి, ఏనుగు నమూనాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటి వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఉత్సవ వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ సందర్శించారు. రాష్ట్ర చిన్న తరహా, మధ్యతరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. హెలీకాప్టర్ విహరించి అరకులోయ అందాలను తిలకించారు.

సైక్లింగ్‌లో అపశ్రుతి

ఉత్సవాల్లో భాగంగా బొర్రా నుంచి అరకులోయ వరకు నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. విజయనగరానికి చెందిన అభిషేక్, ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే అభిషేక్‌ను 108 వాహనంలో అనంతగిరి ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

నాలుగు నిమిషాలకు రూ.4 వేలా..

చలి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన హెలీరైడ్‌కు రూ.4 వేలు తీసుకుని నాలుగు నిమిషాలు మాత్రమే తిప్పుతున్నారని పర్యాటకులు అసంతృప్తికి గురయ్యారు. కనీసం పది నిమిషాలైనా విహరించే అవకాశం కల్పిస్తే బాగుండేదని వారు అభిప్రాయపడ్డారు.

సమ్మర్ ఫెస్టివల్‌లో అందుబాటులో ఉండేలా..

హెలీ రైడ్‌కు జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఆదివారం కూడా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆమోదం వస్తే ఆదివారం కూడా హెలీరైడ్ అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలో నిర్వహించే సమ్మర్ ఫెస్టివల్‌లో హెలీరైడ్ అందరికీ అందుబాటులో ఉండేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కలెక్టర్ దినేష్ కుమార్ కుటుంబ సభ్యులతోపాటు 5కే రన్ మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన జీవనతన్య (7) కుటుంబంతో కలిసి హెలీకాప్టర్‌లో విహరించారు. ప్రకృతి అందాలను తిలకించారు. భవిష్యత్తులో విమానంలో విహరించాలని జీవనతన్య చెప్పిందని, ఈ మేరకు హెలీకాప్టర్‌లో విహారానికి ఆమె కుటుంబానికి అవకాశం కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విజయనగరం చెక్క భజన బృందం, అరకు చొంపి గిరిజనుల థింసా నృత్యాలు, శ్రీకాకుళం తప్పెట గుళ్లు, పార్వతీపురం మన్యం జిల్లా నందికొట్ట ప్రదర్శన, డుంబ్రిగుడ బ్యాండ్‌మేళా, ప్రకాశం జిల్లా సంగాలి డ్యాన్స్, సూఫీ డాన్స్, మిర్రం డాన్స్, జబర్దస్‌కళాకారుల కామిడీ స్కిట్, వందేమాతరం శ్రీనివాస్ సినీ గేయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పనశ్రీ దంపతులు, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ దంపతులు, విశాఖ జిల్లా జడ్జి ఎం.గిరిధర్ దంపతులు వీక్షించారు. వీరితో పాటుగా రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు ఈ కార్యక్రమాలను వీక్షించారు.

ఇదేమి 'పచ్చ'పాతం!


యలమంచిలిలో విద్యుత్ స్తంభాలపై పసుపురంగుతో జై చంద్రబాబు, జై తెలుగుదేశం పేర్లు

యలమంచిలి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కొన్ని భవనాలు, కట్టడాలకు రంగులు వేస్తే, పార్టీ రంగులేశారని ఆ నాడు పచ్చనేతలు గగ్గోలు పెట్టారు. అంతకుమించి ఎల్లో మీడియా కూడా విషపు ప్రచారం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా యలమంచిలి పట్టణ పరిధిలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలకు పచ్చపార్టీ రంగులేసి, తమ ప(క్ష)చ్చపాతాన్ని ఆ పార్టీ నాయకులు చాటుకున్నారు. పట్టణానికి చెందిన ఒక వ్యాపారి అతిగా ఈ రకమైన పబ్లిసిటీ చేసినట్టు చర్చించుకుంటున్నారు. యలమంచిలి ప్రధాన రహదారి నుంచి కొక్కిరాపల్లి రైల్వే గేటుకు వెళ్లే రహదారి పొడవునా, పట్టణంలోని పలు అంతర్గత రహదారుల పక్కన వున్న విద్యుత్ స్తంభాలకు పసుపురంగును పులిమేశారు. అంతేగాకుండా జై తెలుగుదేశం, జై చంద్రబాబు అంటూ నినాదాలు రాసేశారు. వాస్తవానికి విద్యుత్‌స్తంభాలపై ఏ రకమైన పార్టీ ప్రచారం చేయకూడదు. పాయకరావుపేట నియోజకవర్గం ఎస్.రాయవరంలో కూడా ఈ తరహాలోనే విద్యుత్ స్తంభాలకు పసుపు రంగు వేసి జై అనితమ్మ, జై లోకేష్, జై తెలుగుదేశం పెయింటింగులతో పాటుగా సదరు వ్యాపారి నిర్వహిస్తున్న కళావతి కల్యాణమండపం, వెంకటేశ్వరా లాడ్జి, వెంకటేశ్వరా వాటర్ సప్లయిస్ పేర్లు రాయించారు. దీనిపై యలమంచిలి ఏడీఈ ప్రకాశరావు వద్ద ప్రస్తావించగా విద్యుత్ స్తంభాలపై ఏ పార్టీ రంగులు, పేర్లు రాయకూడదని స్పష్టం చేశారు. వెంటనే స్తంభాలపై రంగులు, పేర్లు తొలగించమని ఏఈ, లైన్‌మెన్‌లకు సమాచారమిచ్చామని, వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.


ఎస్ రాయవరంలో రద్దీగా ఉండే రహదారి పక్కన విద్యుత్ స్తంభాలపై జై లోకేష్,జై అనితమ్మ పేర్లు

కూటమి నేతల బరితెగింపు

- కొప్పుగొండుపాలెంలో గ్రావెల్ దందా
- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- అడ్డుకున్న గ్రామస్తులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు, రెవెన్యూ అధికారులు


కొప్పుగొండుపాలెంలో నడిమెట్ట వద్ద అక్రమ గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెం గ్రామంలో ప్రభుత్వ పనుల కోసం అని చెప్పి, అక్రమంగా గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని భారీగా గుంతలు తవ్వించి లారీలతో గ్రావెల్ దోచుకుపోతున్నారు. ఈ తవ్వకాలు గత కొన్ని రోజులుగా ఇక్కడ జరుగుతున్నా.. స్థానిక సర్పంచ్ బద్ది హరిబాబు, గ్రామస్తులు రాంబిల్లి మండలంలో రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలియపరిచినా పట్టించుకోకపోవడంతో స్వయంగా గ్రామస్తులే రంగంలోకి దిగారు. గ్రామంలో నడిమెట్ట వద్ద జరుగుతున్న తవ్వకాల వద్దకు వెళ్లి వాహనాల తాళాలు తీసుకొని ఆపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నేవల్‌బేస్ ప్రాజెక్ట్‌కు సమీపంలో ఉన్న నడిమెట్ట వద్ద నిబంధనలకు విరుద్ధంగా కొందరు కూటమి నేతల సహకారంతో యథేచ్ఛగా అక్రమంగా గ్రావెల్ తరలించేస్తున్నారని చెప్పారు. అధికారులకు తెలియపరిస్తే తవ్వకాలను వదిలేసి రాంబిల్లి ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే మాట్లాడుకుందామంటున్నారని, అధికారులు చేయలేని పని తాము చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తవ్వకాలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తులు ముందుకు వచ్చి ఆపాల్సివస్తోందని, ఇప్పటికైనా స్పందించి తవ్వకాలను నిరోధించాలని కోరారు.

గోవాడ సుగర్స్ సభ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరం : ధర్మశ్రీ

చీడికాడ: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో గల సభ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయిందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు కరణం ధర్మశ్రీ అన్నారు. శనివారం ఆయన చీడికాడలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పరువాడ మహేష్ స్వగృహంలో మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి రూ.89 కోట్ల 70 లక్షల ఆర్థిక సహాయం అందజేయగా, నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. గత నెల 21వ తేదీన ప్రారంభించిన క్రషింగ్ సాంకేతిక కారణాల వల్ల రెండుసార్లు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఫ్యాక్టరీ పరిధిలో గల కాటాల వద్ద, తోటల్లో చెరకు ఎండిపోతుందని, రసనాణ్యత తగ్గిపోతుందని అన్నారు. చోడవరం చెరకు అభివృద్ధి మండలి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చలుగు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లు మితి మీరితే పీడీ యాక్టు

- గంజాయి రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా
- నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు



నర్సీపట్నం: రౌడీ షీటర్లు మితి మీరితే పీడీ యాక్టు ప్రయోగిస్తామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తులు అరాచకాలు సృష్టిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రౌడీ షీటర్లందరికీ కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. వారి కదిలికలపై నిరంతరం పర్యవేక్షణ పెట్టామన్నారు. రౌడీషీటర్లు హింసకు పాల్పడితే పీడీ యాక్టు ప్రయోగిస్తామన్నారు. రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించేందుకు మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యే నిఘా పెట్టామన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టే కార్యక్రమంలో భాగంగా పోలీసు ఆంక్షలు విధించామన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, అధిక లోడుపై దృష్టి సారించామన్నారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి బైక్‌లు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే అసలు ఉపేక్షించవద్దని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

కచ్చితంగా ఎన్నికల నియమావళి అమలు

రాజకీయ పార్టీలు సహకరించాలి:డీఆర్వో


ఎన్నికల ఏర్పాట్లపై రాజకీయ ప్రతినిధులతో సమావేశమైన డీఆర్వో సత్యనారాయణరావు

తుమ్మపాల: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న జరగనుందని, గత నెల 29 నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయడానికి కమిటీలను నియమించామని, రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. జిల్లా డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిని జిల్లా నోడల్ అధికారిగా నియమించామన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు డివిజన్ స్థాయి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు అధికారులుగా వ్యవహరిస్తారన్నారు. మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లను వారి పరిధిలో పర్యవేక్షణ అధికారులుగా నియమించామన్నారు. గత ఏడాది డిసెంబర్ 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 2,802 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మండలానికి ఒకటి చొప్పున 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో షేక్ ఆయిషా, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ వాసు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసులపై నిండుగొండ వీఆర్‌ఏ కుటుంబీకుల దాడి

రోలుగుంట : నిండుగొండలో సారా తనిఖీకి వెళ్లిన ఎక్సైజు పోలీసులపై ఆ గ్రామంలో వీఆర్‌ఏ గుడాల శివతో పాటు అతని కుటుంబీకులు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిండుగ్రామంలో ఈ నెల 26 న శ్రీ గౌరీపరమేశ్వరుల తీర్థం జరిగింది. ఈ తీర్థానికి వెళ్లిన నర్సీపట్నం ఎక్సైజ్ పోలీసులు ఎల్.మాణిక్యరావు, జి.శ్రీనివాసరావు స్థానిక ఎస్సీ కాలనీలో జనాలు ఎక్కువగా ఉండడంతో అనుమానంతో వెళ్లి ఒక ఇంటి వద్ద పరిశీలించగా అరటి చెట్టు మొదల్లో సారాతో ఉన్న బాటిల్ కనబడడంతో స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఇంటి యజమాని అయిన వీఆర్‌ఏ శివను ఎక్సైజ్ పోలీసులు ప్రశ్నించగా కానిస్టేబుల్ వద్ద ఉన్న సారా బాటిల్‌ను శివ లాక్కుని దూరంగా విసిరేశాడు. దీనిపై ఎక్సైజు కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించిన శివను నిలదీయగా అతని అన్నదమ్ములు అయిన అప్పలనాయుడు, వెంకటేష్‌తో కలసి ఎక్సైజ్ పోలీసులను దుర్భాషలాడి ఇంటి నుంచి బయటకు తోసేశారు. దీంతో తమపై దాడికి పాల్పడిన వీఆర్‌ఏ శివపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 27 న తహసీలార్ ఎస్.నాగమ్మకు వారు ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్‌ను శనివారం విలేకరులు ప్రస్తావించగా ఫిర్యాదుపై విచారణ బాధ్యతలు వీఆర్వో, ఆర్‌ఐకి అప్పగించడం జరిగిందని, వారి నుంచి విచారణ నివేదిక అందాల్సి ఉందని తెలిపారు.

బోధన, అభ్యసనాల మధ్య అంతరాలు తగ్గించాలి


రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కేజీబీవీ కార్యదర్శి దేవానందరెడ్డి

తుమ్మపాల: పది, ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాల్ని పెంపొందించడానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాల్సి అవసరం ఉందని రాష్ట్ర కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డి అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాక హైస్కూల్లో కేజీబీవీల పాఠశాల ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయనతోపాటు డీఈవో అప్పారావునాయుడు, సమగ్ర శిక్ష అదనపు సమన్వయకర్త జయప్రకాష్ మాట్లాడారు. బోధన, అభ్యసన ప్రక్రియల మధ్య అంతరాన్ని తగ్గించడానికి కృషి చేయాలన్నారు. 9వ తరగతి విద్యార్థులకు రెండు నెలలపాటు 10వ తరగతి పాఠ్యాంశాలపై ముందస్తు అవగాహన కల్పించే విధంగా ముందుచూపు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇంగ్లీషు మీడియంలో చదువుచున్న విద్యార్థులకు ఇంగ్లీష్‌లోనే బోధన జరగాలని, అందుకోసం ఇంటరాక్టివ్ ప్యానల్స్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులకు సక్సెస్ స్టోరీలు చెప్పాలన్నారు. వారి ఆరోగ్య విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

6 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు అరెస్టు


నిందితులతో స్థానిక పోలీసులు

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం నుంచి వేరొక చోటకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకొని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా, స్థానిక డాబా వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్‌కు చెందిన చంద్రసేన్, పెదబయలుకు చెందిన గోపాలరావుల వద్ద 6 కిలోల గంజాయి, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు అనుమానితులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

నీలమేఘ శ్యామునిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి


ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి శనివారం వజ్ర కవచం తోపాటు నీల మేఘ శ్యాముడిగా భక్తులను కను విందు చేశారు. మాఘ మాసం పుర స్కరించుకొని స్వామిని వజ్ర కవచంతోపాటు వివిధ రకాల పూల మాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నక్షత్ర హారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

5న జిల్లా వృద్ధుల సమావేశం

అనకాపల్లి : స్థానిక వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఈనెల 5న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వంతో గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందని, జిల్లాల్లో వృద్ధులు హాజరుకావాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం వృద్ధులకు రైలు ప్రయాణంలో రాయితీ కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, కరోన విపత్తుల తరువాత వృద్ధులకు రైల్లో రాయితీని తొలగించారని, మరలా పునరుద్ధరించాలని కోరారు.

ఘనంగా వైఎస్సార్ తీర్థం

కశింకోట : మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో నిర్వహించిన వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి తీర్థ మహోత్సవం శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ప్రదర్శించిన డాన్స్ బేబీ డాన్స్, బుర్రకథ వంటి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా, ఉప సర్పంచ్ యర్రంశెట్టి శ్రీను కార్యక్రమంలో పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కశింకోట : కశింకోటలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో ఈ నెల 3న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కానూరి గోపాలరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే శిబిరంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ నుంచి వైద్య సిబ్బంది వచ్చి కంటి పరీక్షలు జరిపి ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా నిర్వహిస్తారన్నారు. అలాగే కళ్లజోళ్లు అవసరమైన వారికి రాయితీపై అందజేస్తారన్నారు. ఆధార్ కార్డుతో శిబిరానికి హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 7,777 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,810	4,320
మొదటి రకం	3,300	4.080
రెండో రకం	2,940	3,500
మూడోరకం	2,850	2,930

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ప్రేమిస్తావా	: సత్యనారాయణ స్క్రీన్-2
మదగజరాజ	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
ఏజెంట్ గయ్ 001	: వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	: శ్రీసత్య
మహేష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 100 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు , బీ పాజిటివ్-30 యూనిట్లు, ఓ పాజిటివ్-50 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 328 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 235 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చును.

ప్లాస్టిక్‌పై నియంత్రణ కరువు..


పట్టణంలో పేరుకుపోయిన ప్లాస్టిక్

- విచ్చలవిడిగా పాలిథిన్ కవర్ల నివియోగం
- నామ మాత్రంగా అధికారుల ప్రత్యేక డ్రైవ్‌లు
- ప్రభుత్వ నిబంధనలకు తూట్లు

అనకాపల్లి : ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. ప్లాస్టిక్‌ని వినియోగిస్తున్న ప్రజల ఆరోగ్యానికి హాని చేస్తోంది. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ పరిమాణం కవర్లు వాడడంతో జరిగే అనర్థాలపై అవగాహన కరువైంది. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు మొత్తుకుంటున్నా వినియోగదారులు, ప్రజలు పట్టించుకోవడం లేదు. పాలిథిన్ కవర్లపై ప్రజల్లో అవగాహన లోపించడం, దానిని వినియోగిస్తే ఎలాంటి అనర్థాలు కలుగుతాయో ప్రజలకు జోనల్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు కల్పించడం లేదు. ప్రజల బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యంతో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నివారణ సాధ్యపడడం లేదు. జోనల్ పరిధిలో నిత్యం ఎక్కడపడితే అక్కడ రహదారులు, దుకాణాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం జరుగుతుంది.


పట్టణంలో ఒక కిరాణా దుకాణానికి నోటీస్ అందజేస్తున్న జోనల్ సిబ్బంది

నిబంధనలకు గండి....

75 మైక్రాన్లలోపు మందం గల ప్లాస్టిక్‌ను వినియోగించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ ఎవరూ పాటించడం లేదు. 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ వ్యాపారులు గ్రామాల్లో, పట్టణాల్లో విచ్చలవిడిగా వాటిని అమ్ముతున్నారు. కిరాణా, సూపర్ మార్కెట్లు, హోటళ్లు, పండ్ల దుకాణాలు, తోపుడుబండ్లు, చిరువ్యాపారులు, చికెన్, మటన్‌దుకాణాలు, చేపలు విక్రయించేవారు, బియ్యం దుకాణాల యజమానులు, వర్తక వాణిజ్య వ్యాపారులు తమ నిత్య లావాదేవీల్లో ప్లాస్టిక్‌ను అడ్డుఅదుపు లేకుండా వినియోగిస్తున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలేవి...

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తే వాటిస్థానంలో జూట్ బ్యాగులను, క్లాత్ బ్యాగులను అందుబాటులో ఉంచాలి. అటువంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఎవరూ చూపడం లేదు. సేంద్రియ పత్తి, వెదురు,చెక్క, మట్టి పింగాణీ, ప్రకృతిలో త్వరగా కలిసిపోయే ప్లాస్టిక్‌తో చేసిన వస్తువులను వాడాలి. మట్టి, పింగాణి పాత్రలను ఆహారం నిల్వ చేయడానికి వినియోగించుకోవచ్చు. ప్రకృతిలో త్వరగా కరిగిపోయే చెత్త బుట్టల్లో వాడే కవర్లుగా, కాగితపు కప్పులను వాడే పైపూతగా, పండ్లు, ఆహార పదార్థాలు, హోటళ్లలో పార్శిళ్లకు పంటపాలాల్లో మట్టిని కప్పేందుకు వాడుకోవచ్చు. ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు రోడ్లపై వేయడంతో అవితిన్న మూగజీవులు సైతం మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.



అవగాహన ఎక్కడా కనిపించడం లేదు



పట్టణంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. టీ దుకాణాల వద్ద వేడి టీని ప్లాస్టిక్ కవర్లలో వేస్తున్నారు. అలా చేయడం వల్ల ప్లాస్టిక్ కరుగుతుంది. ఆ టీ తాగడంతో మానవుడు కొద్ది కాలానికి క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్నాడు. పట్టణ పరిధిలో ఎక్కడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. అప్పుడప్పుడు జోనల్ అధికారులు వచ్చి తూతూ మంత్రంగా కేసులు రాస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలి.

-కె.అప్పారావు, అనకాపల్లి

ఇంజినీరింగ్‌లో జ్ఞానమే పెట్టుబడి

అవంతిలో ముగిసిన సాంకేతిక సదస్సు


ఉత్తమ నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రముఖులు

మాకవరపాలెం: ఇంజినీరింగ్‌లో జ్ఞానమే పెట్టుబడని ఇందుస్థాన్ షిప్‌యార్డ్ జనరల్ మేనేజర్ డి.శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సినర్జీ 2025 పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ సాంకేతిక సదస్సులు శనివారంతో ముగిసాయి. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్య పొందిననాడే సమాజానికి ఉపయోగపడుతుందన్నారు. అవంతి విద్యాసంస్థల చైర్మన్, మాజీమంత్రి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విజయనగరం జెఎన్‌టీయు డైరెక్టర్ బాబులు, శ్రీనివాస పినిశెట్టి(ఐఐటీ భువనేశ్వర్), రవికిరణ్‌శాస్త్రి(ఎన్ఐటీ ఆంధ్రప్రదేశ్)తోపాటు పలువురు ప్రముఖులు సాంకేతికతపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ ఈ సదస్సులో 54 సాంకేతిక నమూనాలు, 230 పేపర్ ప్రజెంటేషన్‌లు, 86 పోస్టర్ ప్రెజెంటేషన్లు ప్రదర్శించారన్నారు. ఈ ప్రదర్శనల్లో ఉత్తమ నమూనాలు రూపొందించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అద్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ ఫ్లెక్సీల తొలగింపు


ఉగ్గినపాలెం వద్ద ఫ్లెక్సీల తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని శనివారం అధికారులు నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో గ్రామాల్లో వీధులు, రోడ్లపై ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. దీనిలో భాగంగా ఉగ్గినపాలెంలో ఫ్లెక్సీల తొలగింపును ఎంపీడీవో వి.వి.రవికుమార్ పర్యవేక్షించారు. ఇంకా వీటిని పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

4న మసమ్మ అమ్మవారి తీర్థం

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో గల శ్రీ మసమ్మ తల్లి తీర్థం ఈ నెల 4వ తేదీ రథ సప్తమి రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, గుర్రాల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎడ్ల పోటీల్లో ప్రథమ బహమతి రూ. 10వేలు, ద్వితీయ బహమతి రూ.8వేలు, తృతీయ బహమతి రూ.5వేలు, నాలుగో బహమతి రూ.3వేలు, ఐదో బహుమతి రూ.2వేలు విజేతలకు అందజేస్తామన్నారు. గుర్రాల పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో, ఐదు బహుమతులుగా వరుసగా రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు చొప్పున విజేతలకుఅందజేస్తామన్నారు. అలాగే దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన, 101 ఘటాలతో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అర్జీలపై సమగ్ర విచారణ జరుపుతాం


సమావేశంలో అర్జీ పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి లక్ష్మీ సుభాషిణి

కశింకోట: కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో సివిల్ భూ సమస్యలను పరిష్కరించడానికి శనివారం నిర్వహించిన మండల స్థాయి కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఒక అర్జీ వచ్చింది. వెదురుపర్తిలో భూ సమస్య పరిష్కారం విషయమై వచ్చిన అర్జీపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మండల నోడల్ అధికారి వి.లక్ష్మీ సుభాషిణి పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చే ఖరీఫ్ నాటికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు


ఎల్‌బీపురం ఎత్తిపోతల పథకం పనులు పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

బుచ్చెయ్యపేట : మండలంలో ఎల్.బి.పురం ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సాగునీటి అందిస్తామని, ఇరిగేషన్ ఈఈ పి. త్రినాథం అన్నారు. శనివారం సాయంత్రం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకానికి రూ.4 కోట్లు వ్యయంతో పనులు చేపట్టామని అన్నారు. ఎల్.బి.పురం, బంగారుమెట్ట, గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి 350 ఎకరాలకు ఈ పథకం ద్వారా సాగునీరు అందుతుందన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, రైతులు సూచనలు, అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని కాలువలు నిర్మిస్తామని పేర్కొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం ప్రారంభం

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్‌పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పాలిమేర కృష్ణ తగు చర్యలు తీసుకున్నారు.

వైభవంగా తులసీ తీర్థం

యలమంచిలి రూరల్: పట్టణానికి సమీపంలో తులసీరావు ఘాట్ వద్ద శనివారం తులసీ తీర్థం వైభవంగా జరిగింది. దివంగత ఆడారి తులసీరావు స్మారకంగా ప్రతి ఏటా ఆయన జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబీకులు ఇక్కడ తీర్థం నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో తులసీరావు కాంస్య విగ్రహానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, తులసీరావు కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాడి రైతులకు తులసీరావు చేసిన సేవలను ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్లు గుర్తు చేశారు. అనంతరం తీర్థాన్ని ప్రారంభించారు. పలు గ్రామాల నుంచి భారీగా మహిళల కోలాట బృందాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు అలరించాయి.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయండి

పోలీసు అధికారులతో 9వ అదనపు జిల్లా జడ్జి


మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి


హాజరైన పోలీసు అధికారులు సిబ్బంది

చోడవరం రూరల్ : లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం కావడానికి పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్ కోరారు. శనివారం స్థానిక కోర్టుల సముదాయంలో చోడవరం కోర్టుల పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందితో వచ్చే నెల 8న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయడానికి సన్నాహక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి రత్న కుమార్ మాట్లాడుతూ మార్చిలో జాతీయ స్థాయి లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సంగతి వెల్లడిస్తూ, ఇరు వర్గాల సమ్మతితో పరిష్కరించ గలిగే కేసులను గుర్తించి వారి మధ్య సయోధ్యకు కృషి చేయాలని చెప్పారు. లోక్ అదాలత్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీ శంకరరావు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరింప బడితే కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. ప్రధాన సివిల్ జడ్జి జి.స్వర్ణ మాట్లాడుతూ ఇరు వర్గాలకు ప్రయోజనం కలగడంతో పాటు కోర్టుల చుట్టూ తిరిగి కాలయాపన చేయాల్సిన అగత్యం ఉండదన్న సత్యాన్ని వారికి తెలపాలన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.సూర్యకళ మాట్లాడుతూ కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం ద్వారా పోలీసులు, కోర్టులకు సమయం, రికార్డుల మెయింటెనెన్స్ వంటి ఇబ్బందులు తప్పుతాయన్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.రమణమ్మ, చోడవరం సీఐ అప్పలరాజు, ఇతర పోలీసు అధికారులు తమ సలహా, సూచనలను అందజేశారు.

'లక్షల డప్పులు..వేల గొంతులు' పోస్టర్ ఆవిష్కరణ


లక్షల డప్పుల ఎమ్మార్పీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగరాజు సంఘం సభ్యులు

అనకాపల్లి: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్షల డప్పులు వేల గొంతులు కార్యక్రమాన్ని ఈనెల 7న తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యున్నంగి నాగరాజు అన్నారు. స్థానిక సుంకరమెట్ట జంక్షన్ సంఘం కార్యాలయంలో పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత హైదరాబాదులో జరగబోవు లక్షల డప్పుల కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు, నాయకులు కొల్లి చిన్నఅప్పారావు, కట్టమూరు మంగరాజు, కాకినాడ కనకేశ్వరరావు, గంపల చినరాజు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ


కశింకోటలో పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట: మండలంలో 96.87 శాతం మందికి శనివారం పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. కశింకోటలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొత్తం 10264 వృద్ధాప్య, వికలాంగ, వితంతు పింఛన్లు ఉండగా, వాటిలో 9943 మందికి పింఛన్లు పంపిణీ పూర్తి అయిందన్నారు. ఇంటి వద్ద వివిధ కారణాల వల్ల లేని మిగిలిన వారికి సోమవారం అందజేస్తారన్నారు. సచివాలయ సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ సిబ్బందితో వీటిని పంపిణీ చేయిస్తున్నట్టు తెలిపారు.

క్వారీ కార్మికులకు వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి : మండలంలో వందల హెక్టార్లలో రోడ్ మెటల్ అంట్ బిల్డింగ్ స్టోన్ క్వారీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల 11వ వేతన ఒప్పందాన్ని అమలు చేసేందుకు క్వారీల యాజమాన్యం చర్చలు తీసుకోవాలని జిల్లా క్వారీ, క్రషర్స్ కార్మిక సంఘం(సూ,ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు పండా గణేష్, రాష్ట్ర నాయకుడు కోన మోహన్‌రావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక గుండాల జంక్షన్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ క్వారీల్లో డ్రిల్లింగ్ చేసే కార్మికులకు ఒక అడుగు డ్రిల్లింగ్‌కు గతం నుంచి చెల్లిస్తున్న రేటుపై రూ.4 చెల్లించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా క్వారీ యాజమాన్యం కార్మికుల వేతనాలు పెంచాలని, 11వ వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. క్వారీ క్రషర్‌ల్లో విధులు నిర్వహిస్తూ మృత్యువాత పడిన కార్మికునికి రూ.25 లక్షల పరిహారం, అంత్యక్రియలు నిమిత్తం రూ.2లక్షలు ఇవ్వాలని ఆయన కోరారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో అంగవైకల్యం కలిగిన కార్మికులకు ఆస్పత్రి ఖర్చులు యాజమాన్యం చెల్లించి, కుటుంబ పోషణ నిమిత్తం నెలకు రూ.3వేలు చెల్లించాలని, కంప్రెషర్ డ్రైవర్లకు ప్రస్తుతం ఇస్తున్న నెల జీతాలను రూ.6వేలు పెంచాలని, క్రషర్ బుగ్గితో గ్రామాల్లో కిడ్నీ, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సంఘం నాయకులు జి.సూర్యారావు, ఎస్.సూరిబాబు, సీహెచ్ రమేష్, చిన్నారావు, గంగరాజు, కార్మికులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆటో డ్రైవర్ బీభత్సం

అనకాపల్లి : మద్యం మత్తులో ఆటో నడిపి పలు వాహనాలను ఢీకొన్న ఆటో డ్రైవర్ కోటిపల్లి పైడికాంత్‌పై ట్రాఫిక్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ కథనం మేరకు వివరాలు...శనివారం మద్యం మత్తులో సుంకరమెట్ట జంక్షన్ నుంచి గవరపాలెం సత్తెమ్మతల్లి అర్చు రహదారిలో ఆటో డ్రైవర్ హల్‌చల్ చేసి మూడు బైక్‌లను ఒక వ్యక్తిని ఆటోతో ఢీకొట్టాడు. ఈ ఘటనపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శన


బొమ్మల ప్రదర్శన తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు


ప్రదర్శనలో ఉంచిన ఏటికొప్పాక బొమ్మలు

రోలుగుంట : కుసర్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏటికొప్పాక బొమ్మల ప్రదర్శనను శనివారం ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అప్పాన రాంబాబు స్ఫూర్తితో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో జాతీయ భావం, పనిపట్ల గౌరవం, ఈ ప్రదర్శన వల్ల ఏర్పడుతుందని పాఠశాల హెచ్‌ఎం శెట్టి మోహనరావు అన్నారు. ఏటికొప్పాక బొమ్మలు తయారు చేసిన శకటానికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏపీ నుంచి మూడో స్థానం సంపాందించారన్నారు. ఈ బొమ్మలను అంకుడు కర్రతో సహజ సిద్ధమైన రంగులతో తయారు చేస్తారని, ఇది అంతర్జాతీయంగా ప్రాముఖ్యత కలిగి ఉందని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.పద్మావతి పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



కె.కోటపాడులో నిరసన తెలుపుతున్న కార్మికులు



మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన

కె.కోటపాడు : జిల్లాలో గల ఏరియా, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనాలను అందించాలని ఏపీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. స్థానిక సీహెచ్‌సీ వద్ద ఆస్పత్రి కార్మికులకు కనీస వేతనాలను అందించాలని శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మణ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో తక్కువ వేతనాలతో పారిశుధ్య కార్మికులతో పని చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. వీరి పీఎఫ్ డబ్బులను కూడా పక్కతోవ పట్టిస్తున్నట్టు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఏఐటియూసీ నాయకులు శేఖర్, పారిశుధ్య సిబ్బంది నాగరత్నం, అరుణ కుమారి, లక్ష్మి, సత్యవతి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్, ఈశ్వరమ్మ, నూకరత్నం పాల్గొన్నారు.

మాడుగుల : జిల్లాలో జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కార్మికులకు, ప్రభుత్వ జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ఏఐటీయుసీ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక 30 పడకల ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కనీస వేతనాలు అమలు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి వారి డిపాజిట్లు నిలుపుదల చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.